# తెలంగాణ దిశ
## భాగ్యనగరి

హైదరాబాద్ | రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్ - మల్కాజిగిరి    సోమవారం, జూలై, 28, 2025    పేజీలు : 08


# దశాబ్దకాలం తర్వాత నిజమైన.. తెలంగాణ పోరాట యోధులకు గుర్తింపు

- సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే అసలైన ఉద్యమకారులకు న్యాయం
- తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ స్మారక పురస్కారం
- రవీంద్రభారతిలో కన్నుల పండువగా తెలంగాణ సన్మాన్ పురస్కారాల ప్రధానోత్సవం





**హైదరాబాద్, జూలై 27, (తెలంగాణ దిశ) :** దశాబ్ద కాలం తర్వాత నిజమైన తెలంగాణ పోరాట యోధులకు గుర్తింపు లభించడం అభినందనీయమని తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షులు నారగౌని పురుషోత్తం నేతృత్వంలో రవీంద్రభారతిలో తెలంగాణ సన్మాన్ 2025 పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీర్ల ఐలయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ స్మారక పురస్కారాన్ని బీర్ల ఐలయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయ సంస్థ జాయింట్ సెక్రెటరీ శ్యాం ప్రసాద్ లాల్ సభకు అధ్యక్షత వహించారు. భాషాభివృద్ధి సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ గౌరవ అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మికి వీరనారి చిట్యాల ఐలమ్మ స్మారక పురస్కారాన్ని అందజేశారు. వీరితో పాటు సీనియర్ ఫిలిం క్రిటిక్ పొన్నం రవిచంద్రకు పైడి జయరాజ్ స్మారక పురస్కారం, ప్రముఖ గాయకులు దరువు అంజన్నకు ప్రజా యుద్ధ నౌక గద్దర్ స్మారక పురస్కారం, సీనియర్ పాత్రికేయులు కాసుల ప్రతాపరెడ్డికి తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి స్మారక పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే అసలైన ఉద్యమకారులకు గుర్తింపు లభిస్తోందని అన్నారు. పది సంవత్సరాలుగా ఉద్దేశపూర్వకంగా అనగదొక్కిన కవులు, కళాకారులకు అసలైన గుర్తింపు లభిస్తుందని ఆయన అన్నారు. దొరల గడీలకు భజన చేసే కళాకారులకు తప్ప అసలైన ఉద్యమకారులకు గుర్తింపు లభించలేదని అన్నారు. వివిధ కార్యక్రమాల ద్వారా వారిని గుర్తించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కేవలం తనకు వంత పాడలేదన్న ఉద్దేశంతో కెసిఆర్ దూరం పెట్టిన వారందరిని సీఎం రేవంత్ రెడ్డి గుర్తించి వారి అభిప్రాయాలు ఎలా ఉన్నా సరే ఉద్యమంలో వారు చేసిన పనిని గుర్తించి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ అవార్డు గ్రహీత ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ స్థాపించి నాటి అసలు సిసలైన తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు నిస్తూ ప్రోత్సహించే విధంగా కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరిట అవార్డు ఇవ్వడంతో తన బాధ్యతను పెంచిందని, ఈరోజు నుంచి మరింత జాగ్రత్తతో తన విధులు నిర్వర్తిస్తానని ఆయన అన్నారు.



బీసీ కమిషన్ సభ్యురాలు, చాకలి ఐలమ్మ పురస్కార గ్రహీత రంగు బాలలక్ష్మీ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పుట్టిన గడ్డ నుంచి తాను రావడం, ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకుంటూ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడడం..., సాధించిన రాష్ట్రంలో వివక్షతను ఎదుర్కొంటూ దశాబ్ద కాలం తర్వాత ఇటువంటి సన్మానాన్ని అందుకోవడం సంతోషకరమని అన్నారు. పైడి జయరాజు పురస్కార అవార్డు గ్రహీత పొన్నం రవిచంద్ర మాట్లాడుతూ దాదాసాహెబ్ అవార్డు పొందిన పైడి జయరాజును తెలుగు చలనచిత్ర రంగం పరిశ్రమ అనేక దశాబ్దాలుగా విస్మరించిందని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆయన సేవలు గుర్తించలేదని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే అలా మరుగున పడిపోయిన వారికి గుర్తింపు లభిస్తోందని అన్నారు. గద్దర్ అవార్డు గ్రహీత దరువు అంజన్న మాట్లాడుతూ తెలంగాణ కోసం నిరంతరం కొట్లాడిన పోట్లాడిన గద్దర్ అన్న స్మారక అవార్డు తనకు లభించడం తనకెంతో చిరస్మరణీయమని తెలిపారు. పన్నెండ్లుగా గుర్తింపు లేని తమకు ఈ అవార్డు ఇవ్వడం గద్దర్ అన్నను స్మరించుకోనే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని అన్నారు. తెలంగాణ వైతాళికులు సురవరం ప్రతాపరెడ్డి స్మారక అవార్డు గ్రహీత కాసుల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఆ మహనీయుని పేరిట తనకు అవార్డు ఇవ్వడం తెలంగాణ ఉద్యమంలో తనను గుర్తించడం ఎంతో బాధ్యత పెంచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు మెరుగు చంద్రమోహన్, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు కాలేరు సురేష్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సీనియర్ నాయకురాలు మెరుగు సునీత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.








## పర్యావరణ పరిరక్షణకు లయన్స్ క్లబ్ చేస్తున్న

# సేవలు అభినందనీయం

### భాగ్యనగర్ గ్రీన్ సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హరితహారం

**కుషాయిగూడ జూలై 27, (తెలంగాణ దిశ):** పర్యావరణ పరిరక్షణకు లయన్స్ క్లబ్బులు విరివిగా నాటుతున్న మొక్కల కార్యక్రమం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు ఇమ్మిడిశెట్టి రామానుజం అన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ జై జవాన్ కాలనీ పార్క్ నెంబర్ 3లో లయన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ ఆధ్వర్యంలో కుషాయిగూడ సబ్ ఇన్ స్పెక్టర్ నిర్మల వెంకన్నతో కలసిమొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని సూచించారు. భాగ్యనగర్ గ్రీన్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ వడ్లోజుజ్యోతిర్మయచారి అధ్యక్షతన చేపట్టిన సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ శాని టషన్ సిబ్బందికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ గ్రీన్ సిటీ లయన్స్ క్లబ్ చేస్తున్న ప్రజాహిత సంక్షేమ కార్యక్రమాలు మరింత విస్తరించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు లయన్ జ్యోతిర్మయచారితో పాటు లయన్ మహంకాళి నరసింహచారి, కార్యదర్శి విష్ణు సాయి ప్రసాద్, కోశాధికారియాదగిరి, యూత్ కాంగ్రెస్ నాయకులు నారాయణ,రఘు తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభం






**మల్లాపూర్, జూలై 27, (తెలంగాణ దిశ):** మల్లాపూర్ డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీలో సంక్షేమ సంఘం యొక్క నూతన భవన నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ విచ్చేసి కొబ్బరికాయ కొట్టిపనులను ప్రారంభించారు. ఈ సంద ర్భంగా తమ సంక్షేమం కోసం సమస్యలను పరిష్కరిం చుకునేందుకు సమావేశ భవనాన్ని నిర్మిస్తున్నందుకు గ్రీన్ హిల్స్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త మల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవిరెడ్డి రంగారెడ్డి, సంయుక్త కార్యదర్శి నెమలి సురేష్, శేఖర్, వెంకట్ రెడ్డి, హనుమంత్, శ్రీనివాస్, మాధవ్, అనిల్, హరి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవలో ట్రస్ట్ కార్స్ యజమాని మహమ్మద్ రోషన్

### ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్న మానవాతవాది.
### నాచారంలో సమాజ సేవ చేస్తున్న మహమ్మద్ రోషన్







నాచారం, జులై 27, (తెలంగాణ దిశ) : మానవత్వానికి చిరునామా... మహమ్మద్ రోషన్. మంచితనానికి మారు పేరు... కొంచం సహాయం చేద్దాం.. అంటే ఎవరు రారు.. కానీ... మహమ్మద్ రోషన్ అలా కాదు.. "మానవసేవే మాధవసేవ" అంటూ సమాజసేవలో ముందంజలో ఉంటారు. అందుకే మానవత్వానికి నిర్వచనం ట్రస్ట్ కార్స్ యజమాని మహమ్మద్ రోషన్ చెబుతుంటారు అందరూ. ఎదుటి వ్యక్తులు ఆపదలో ఉంటే ఆదుకునే తత్వం అందరికీ ఉండదు.. వందల్లో కొందరికి మాత్రమే ఈ లాంటి అంకితభావం కలిగి ఉంటారు..
ఆ కోవకే చెందిన వ్యక్తి నాచారంలో ట్రస్టు కార్స్ పేరుతో ఇంటింటికి కారు అనే నినాదంతో కారు మేలా నిర్వహిస్తూ పేద ప్రజలకు కారు చౌకగా కార్లను అందిస్తున్న ట్రస్ట్ కార్స్ యజమాని మహమ్మద్ రోషన్.. ఇదంతా ఎందుకు అంటే.. గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరం లోని అనేక ప్రాంతాలు వర్షం నీటితో జలమయమవుతున్నాయి. దీంతో సిటీలో ట్రాఫిక్ స్తంభించిపోతున్న విషయం తెలిసిందే. సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లో మహమ్మద్ రోషన్ తన తోటి సిబ్బందితో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ట్రాఫిక్ పోలీసుల ట్రాఫిక్ కామబద్ధీకరణ విధులు నిర్వహిస్తున్నారు.
ట్రాఫిక్ ను కంట్రోల్ చేస్తూ..
వచ్చి పోయే టూ వీల్లర్స్, ఫోర్ వీల్లర్స్ వాహనాలను కంట్రోల్ చేస్తూ ట్రాఫిక్ సజావుగా వెళ్లేందుకు కృషి చేస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు, నాయకులు, వచ్చి పోయే ప్రజల మన్ననలు పొందుతున్నారు.
ఈ మానవత్వంతో రోషన్ చేస్తున్న సేవలను ప్రతి ఒక్కరు ఆచరిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, అందరికీ మేలు జరుగుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.
ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ట్రాఫిక్ సజావుగా సాగుతుందని అభిప్రాయపడుతున్నారు. ఎలాంటి స్వార్థం లేకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేస్తున్న రోషన్ ను పలువురు అభినందించారు.

# బాచుపల్లిలో ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

### ముఖ్య అతిథిగా హాజరైన పట్నం మహేందర్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, జూలై 27, (తెలంగాణ దిశ):** బాచుపల్లిలోని పోచమ్మ తల్లి బోనాల వేడుకల్లో తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డిసిసి అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి తదితరులతో కలిసి పోచమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు బోనాల శుభాకాంక్షలు తెలిపారు. పోచమ్మ తల్లి కృపా కటాక్షాలతో అందరూ సుఖ సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోలన్ కృష్ణారెడ్డి, కోలన్ బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

